విజయ - ఫాల్గుణము - ౨౦ తారీఖు. సంపుటము - 3 సంచిక - 9.

శ్రీ

చింతామణి

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము 3] రాజమహేంద్రవరము. విజయసంవత్సర ఫాల్గుణమాసము. [సంచిక ౯.

కృతివిమర్శనము.

వైజయంతి.


చెన్నపురిలో మూఁడుమాసములనుండి బ్రహ్మశ్రీ రాయిబహదూరు పి. ఆనందాచార్యులవారిచే ప్రచురింపఁబడుచున్న శ్రీ వైజయంతి యనెడు తెలుఁగు మాసపత్రికను జూచి మిక్కిలి యానందించుచున్నాము. "విద్యావిషయములుగల వ్యాసములును, పురాతనగ్రంథ గుణాగుణ ప్రదర్శకంబులగు చర్చలును, నముద్రితంబులగు పూర్వకృతిరత్నంబులును, నవీన కావ్యములును, నాధునికగ్రంథ విమర్శనంబులును, లక్షణజ్ఞాన ప్రదంబులగు లేఖలును" ఈ పత్రికయందుఁ జేర్పఁబడునని పత్రికాధిపతులు తెలిపి యున్నారు. దీనినిబట్టి యీపత్రికయొక్క ముఖ్యోద్దేశము భాషాభివృద్ధియని యెల్లవారును దెలిసికొనవచ్చును. ఆంధ్రమహాభారతముయొక్క గుణాగుణ ప్రదర్శకవ్యాసమొకటి యిందు పత్రికావిలేఖకులచే చక్కఁగా వ్రాయఁబడియున్నది. పూర్వగ్రంథములలో కనుపర్తి యబ్బయామాత్యప్రణీతమైన యనిరుద్ధచరిత్రము ప్రచురింపఁబడుచున్నది. నూతన కావ్యములలో వల్లకీపల్లవోల్లాసమను పద్యకావ్యమును, మదనమోహనచరిత్ర యను వచన కావ్యమును, ప్రకటింపఁ బడుచున్నవి. బ్రహ్మశ్రీ కొక్కొండ వేంకటరత్నము పంతులవారిచే నాంధ్రీకరింపఁబడిన ధనంజయ విజయవ్యాయోగమొకటి ముగింపఁబడినది. సోమశర్మాభ్యుదయమను మఱియొక యాధునికవచనప్రబంధ మారంభింపఁబడినది. ఈ గ్రంథములన్నియు లాక్షణికమై నాతికఠినమైన శైలిని వ్రాయఁబడుచున్నవి. ఈ పత్రిక నాంధ్ర భాషాభిమానులందఱును తప్పక తెప్పించుకొందురని నమ్ముచున్నాము. ఇది చింతామణి పరిమాణముగల ముప్పదిరెండు పుటలను గలిగి యున్నది. అంచెకూలితోడఁగూడ దీనికి చందా సంవత్సరమునకు రెండురూపాయల యెనిమిదణాలు.



MARQUES OF LANSDOWNE.

లాండ్సుడౌన్ ప్రభువుగారు.

ఈ పైపటమునందుఁ జూపఁబడినవారు గతసంవత్సరాంతము వఱకును మన హిందూదేశమునకు రాజప్రతినిధిగానుండి యిప్పుడుస్వదేశమున కేగినలాండ్సుడౌన్ ప్రభువుగారు. ఈయన ౧౮౮౮వ సంవత్సరము డిసెంబరునెల ౧౦వ తేదిని కలకత్తా నగరమునందు హిందూదేశ రాజ్యభారమును వహించి యైదు సంవత్సరము లీదేశమును పాలించిరి. ఈయనకాలమునందు మణిపుర సంస్థానమింగ్లీషువారి రాజ్యములో చేర్చుకొనఁబడినది ; రాజప్రతినిధిగారియొక్కయు స్థానిక పరిపాలకులయొక్కయు శాసననిర్మాణసభలలోని సభికులయొక్క సంఖ్య హెచ్చుచేయఁబడి వారిలో కొందఱి నేర్పఱుచుకొనెడు స్వాతంత్ర్యము జనులకీయఁబడినది. ఈయేర్పాటువలన దేశమునకు మంచిలాభము కలుగవచ్చును.



EARL OF ELGIN.

ఎల్జిన్ ప్రభువుగారు.

ఈ పయిపటములోఁ జూపఁబడినవారు లాండ్సుడౌన్ ప్రభువుగారి తరువాత మన దేశమును పాలించుటకయి నియమింపఁబడిన క్రొత్త రాజప్రతినిధిగారయిన యెల్జిన్ ప్రభువుగారు. ఈయన కడచిన జనేవరు నెల ౨౦వ తేదిని బొంబయి నగరమునందోడదిగి రాజధానికిఁబోయి రాజ్యభారమును వహించి మన దేశము నిప్పుడు పరిపాలించుచున్నారు. వీరిపరిపాలనమువలన దేశమునకుఁగలిగెడు లాభములను ముందుచూడవలసియున్నది. పూర్వము వీరితండ్రిగారగు ఎల్జిన్ ప్రభువుగారు ౧౮౬౨వ సంవత్సరము మార్చి నెల ౧౨వ తేదిని రాజప్రతినిధిగా వచ్చి రాజ్యభారము పూని యల్పకాలముమాత్రమే దేశమును పాలించియీ దేశములోనే ౧౮౬౩వ సంవత్సరము నవంబరు నెల ౨౦వ తేదిని ధర్మశాలవద్ద కాలధర్మమునొందిరి.



BARON WENLOCK.

వెన్లాకు ప్రభువుగారు.

ఈ పయిపటమునందుఁ జూపఁబడినవారు మన చెన్నపురి రాజధానిపరిపాలకులగు వెన్లాకు ప్రభువుగారు. ౧౮౯౦వ సంవత్సరము డిసెంబరు నెల ౨౦వ తేదిని వీరీపనికి నియమింపఁబడి ౧౮౯౧వ సంవత్సరము జనేవరు నెల ౨౩వ తేదిని చెన్నపురిలో పరిపాలనమును వహించినారు. వీరుగతసంవత్సరము మార్చినెలలో మహారాజమహేంద్రవరమునకు విజయముచేసి యిక్కడిశాస్త్రపాఠశాలను జూచి యీపట్టణమునకు విద్యావిషయమునందు కొంతమేలు చేయఁదలఁచి యిక్కడబోధనాభ్యాసశాస్త్రపాఠశాలను స్థాపించుట కేర్పాటుచేసినారు. ఫిబ్రవరి నెలలో కలకత్తాకుఁబోయి రెల్జిక్ష ప్రభువుగారితో మాటాడి గోదావరి వంతెనను శీఘ్రముగా కట్టించుటకును బెజవాడనుండి నెల్లూరుమీఁదుగా చెన్నపురికి యయోమార్గమును వేయించుటకును కృషిచేసిరిగాని వీరికృషి శీఘ్రముగా సఫలమగు సూచనలు కానరావు: